# విష్ణుదేవుని కంప్లెయింటు

శ్రీ చదువుల రామచంద్రయ్య బి. ఏ.

[పార్థసారథి గుళ్లో-పాత మంచముమీద పండుకొని వుంటాడు పార్థసారథి. మంచం కడ్డంగా తెరుంటుంది. అంతా చీకటిగా ఉంటుంది. ఇంకా తెల్లవారలేదు. దేవుని మెళ్ళో హారాలు పక్కమీద కుప్పబడి వుంటాయి.]

పార్థసారథి:-[పక్కపైన దొర్లుతూ]

ఆర్చక ముండాకొడుకింకా రాలే. టిఫిను బాగా తినిగాని రాడు. ఎన్నాళ్లు యీరీతిగా వీరు చేసేదానికి ఒప్పుకుని బ్రదికేది. ఈవేళ వాడు రానీ, నా యిష్టము వచ్చినట్లు చేస్తేనే తప్ప వానిభరతం పట్టిస్తా. ఈవేళ మంచి శకునంతో కళ్లు తెరవాలి. ప్రతిదినం అద్దం చూడను గాని అద్దం చూపించే అర్చకుని పాడుముఖం చూచే యీ పాట్లన్నీ. (తలుపుతీసే చప్పుడౌతుంది) ఓహో వస్తున్నాడు ఆర్చకుడు.

(అర్చకుడు ఒకచేతిలో అద్దం పట్టుకొని రెండవ చేతిలో తాళంచెవులు పట్టుకొని లోపలకి వస్తాడు. దేవునికి దగ్గరగా బోయి అద్దం చూపించి వెళ్లబోతాడు.)

పార్థ:-అర్చకా! అద్దం సరిగా చూడనియ్యవోయి. చూచేదానికిక్కళ్లు తెరిచేదానికి ముందే దాన్ని తీసేసి నీముఖం చూపెడుతావు.

అర్చకుడు:-(ఆశ్చర్యముతో) కృతార్థుణ్ణి. నా యెడల భగవంతునికి దయ వచ్చింది.) దేవా! బాగా చూడండి.

పార్థ:-ప్రతిదినం అపశకునమే. అందుచేత నేను చెప్ప దలచినది చెప్తే లెక్కపెట్టరనేనాప్రేల్తున్నా

అర్చ:-ప్రతిదినం అద్దంచూపెడుతున్నానే, వెంటనే గోవును కూడా——

పార్థ:-దానికంటే ముందు నీ పాడుముఖం. చాల్లే. స్నానానికి నీళ్లు దెచ్చావా?

అర్చ:-చిత్తం. పట్టుకొచ్చాను.

పార్థ:-ఎక్కడనుంచి?

అర్చ:-తమ కొలనులోనుంచి.

పార్థ:-రామ రామ. ఇంకెంతకాలం ఆ పాడునీళ్లు మొఖాన కొట్టుకునేది. వాసనపట్టి వచ్చగా తిరిగి కంపుకొడుతూండే నీళ్లు నానెత్తిన ప్రతిదినం పోసేదానికంటె ఆ కార్పొరేషన్ కొళాయినీళ్ళయినా పొయ్యకూడదా. అవీ నాకు గతిలేదా. ప్రతిదినము గాకుండా పెండ్లికి కూడ ఉత్సవాలకుకూడ ఈనీళ్లే. ఈనీళ్లు పోసుకుంటే ఆ సువాసనకు భార్యకూడ దగ్గరకు రాదే! ఉత్సవ వేళ చూచేవాళ్లు మొదలే దగ్గరకు రారు. ఎన్నాళ్ళని దీన్ని సహించమంటావయ్యా!

అర్చ:-దేవరవారాలా సెలవిస్తే ఆ కొలనిలో నీళ్ల పుణ్య తీర్థాలని తామే——

పార్థ:-నీముఖం. అలా జెప్పడానికి నాకే తెలివి లేదనా నీ వాదన? లేకపోతే దాల్లో పడి చచ్చేమనుషుల వల్ల ఆతీర్థాలు పావనాలయినా వారాని కొకడు అందులో పడిచస్తుంటాడే. ఆనీళ్లుఎట్లయ్యా నానెత్తిన పోస్తావు, పో, కుళాయినీళ్లు పట్టుకురా!

అర్చ:-చిత్తం. (తనలో) మనుషులకులాగు దేవుళ్ళ చిత్తాలు కూడా మారుతున్నాయి. కలికాలం!

(అర్చకుడు కొళాయిలో శుద్ధమైన నీళ్లు పట్టుకొని వచ్చి స్నానం చేయిస్తాడు పార్థసారథికి. ఆ గుడ్డలే చుట్టబోతాడు.)

పార్థ:-అర్చకా! ప్రతిదినం నీవీ వచ్చీరాని యిష్టంతో ఉతికి, మైలపోని గుడ్డలే కట్టిపెట్టకపోతే ఏ లాండ్రీకైన వేసి, ముక్కానీ డబ్బిచ్చి ఉతికించరాదయ్యా.

అర్చ:-దేవరవారికి చాకలి ముట్టిన ఉడుపులు మరుగు లేకుండా పనికొస్తాయా.

పార్థ:-మీకుమాత్రం పనికొస్తాయి కాబోలు షోకు చేసుకొని తిరగడానికి! మీ కుపయోగించేవే గదయ్యా మా కిస్తారు? మీకు లేనివి మాకేమి నూతనంగా యిచ్చారో చూపించూ?

అర్చ:-పర్మాత్ములకు సృష్టికర్తలకు మేమే మివ్వగలము స్వామీ?

పార్థ:-అన్నీ ఇవ్వగలరు. ఇష్టమువచ్చినట్లు వడించ గలరు. మీ దయా దాక్షిణ్యాలపై బ్రతికే కాలం వచ్చింది. కానీగాని, నైవేద్యం యేం జేసావు?

అర్చ:-తీర్థము, పొంగలి.——

పార్థ:-నీ తలకాయ-ప్రతిదినం పొంగలి. నాకట్లు చూపించే దానినిగూడా తిననివ్వరులే-దానికంటె ఉడిపీదోశయో, రెండిడ్లీలో అంత ఉప్మానో చేసి పెట్టగూడదటయ్యా, ఈ పనికిమాలిన పొంగలేనా ప్రతిదినం ?

అర్చ:-స్వామీ, ఆలా సెలవివ్వకూడదు. తామవన్నీ తినకూ——

పార్థ:-మీరు బాగా మెక్కచ్చు దినానికొకటి. పూర్వ కాలం ననుసరించి మీరు తింటున్నదేమో నాకు వాడుక చేస్తిరి. ఇపుడు కాలం మారింది. మీరు తినేది ఇపుడుమాత్రం ఎందుకు పెట్టకూడదయ్యా. మీరు తినలేదంటారా, నిజంచెప్పు, నీవెన్ని యిడ్లీలు తిన్నావు యీవేళ, ఎంతకాఫీ త్రాగినావు?

అర్చ:-చిత్తం ఆరు ఇడ్లీలు రెండు టంబర్ల కాఫీ.

పార్థ:-రేపు అరడజను రవదోశలు గదూ, నాకుమాత్రం యెందుకు పనికిరావయ్యా అవి? ముఖ్యంగా కాఫీ టీ; కోకో అంటే నీళ్లూరుతాయి నాకు.

అర్చ:-అవి దేహానికే చెడుగుస్వామీ ?

పార్థ:-ఈ కాలంలో ఏభై యేళ్లు గూడా బ్రతుకని మీరు తెగత్రాగుతూంటే బాకీలేని నాకేమి జేస్తాయయ్యా అవి ?

అర్చ:-చిత్తం, ఆలోచించ వలసిందే !

పార్థ:-అట్లా దోవకురా! ఎవరో వస్తున్నారు చూడు.

అర్చ:-తమ దర్శనానికి అర్చన చేయించడానికి, వారువెళ్లి పోయిన తరువాత మాట్లాడు దాం.

(కొంతమంది పూజాద్రవ్యములతో వచ్చి అర్చకుని చేతికి వానిని ఇస్తారు. అర్చకుడు అన్నీ దేవుని పాదాల దగ్గరుంచి, దడదడా వచ్చీరాని శ్లోకాలు నోటిలోనే చదువుకొని అపుడపుడు గట్టిగా అరస్తూ కర్పూరము ముట్టించి గంటవాయించును. హారతి తీసుకొని అంతా వెళ్లి పోతారు.)

పార్థ:-అర్చకా, చూశావా! వీరంతా వచ్చినపుడెల్లా విగ్రహములాగ యేమి చెప్పేదానికి నోరాడకుండా ఉన్నా, ఇంత షోకుగా వచ్చేవాళ్లని జూసి సిగ్గవుతుంది. నల్లరాతి మొద్దులాగు పంగనామాలుపెట్టి నిల బెట్టక పోతే ఒక పాప్లిన్ షర్టైన కుట్టించగూడదా ?

అర్చ:-తమ రూపం ఆనందమయం.తమరు పరమాత్ములు' తమ కెందు కండీ ఇవన్నీ ?

పార్థ:-ఔను. నన్ను తటాలున జూస్తే ఎవరైనా భయ పడవలసిందే; అటువంటి రూపవంతుణ్ణి జేశారు. పైగా గుడ్డ లెందు కంటావు! నాకేమీ అక్కర లేకపోతే ఈగుడ్డలన్నీ ఈ వల్లెవాటులన్నీ (ఎన్నేళ్లవో) ఎందు కయ్యా ?

అర్చకుడు:-చిత్తం అవిచ్చి నపుడు తాము కోరినవి గూడ ఇవ్వవలసిందే. దేవర భోజనానికిపొద్దవుతుంది.

పార్థ:-ఔను మరచాను. ఈవేళయేమి వంటలు ?

అర్చ:-ప్రతి దినం వంటలే! పులిహోగిరం, దధ్యాన్నం, పాయసం.

పార్థ:-నీముఖం నాప్రారబ్ధం. ఏడిచేవు. ప్రతిదినం యివే చేయా లేమిటి? మార్చగూడదా ? ఉదయం సాయంత్రం మార్చి మార్చి చిత్ర విచిత్రాల పిండి వంటలతో తినే మీరు ఒక మాసం యీదధ్యాన్నాలు పులిహోరలు, పొంగలులు, మొదలైనవి తిన్నారంటే మరి మీకే తెలుస్తుంది వాటి మజా! మీ కోసరంగాదనా ఇవన్నీ యిట్లు ప్రతిదినం చేస్తారు.

అర్చ:-స్వామీ! మన్నించాల, ఇంక మీదట తాము శెల విచ్చినట్లే——

పార్థ:-చేయింతువులే: వడ్డించు.

అర్చకుడు(ఇంకా ఇద్దరు బ్రాహ్మణులతో చెమటకార్చు కుంటూ పెద్దపెద్ద అండాల్లో వంటలన్నీ తెచ్చి దేవుని ముందు పెడతాడు. పొగలు లేస్తుంటాయి వానిలో నుండీ, కమ్మనివాసన గుడంతా నిండు కొంటుంది. అక్కడవుంటే వంటలు చూస్తే వందమందికిపైగా తయారుచేసినట్టుంది. అర్చకుడు ఒక్కొక్కదాని మీద

చెబుతూ అది సమర్పియామి ఇది సమర్పయామి అని ఆరంభించే వేళకు.

పార్థ:-(కోపంతో)నీకు పిడిగుద్దులు సమర్పయామి నాతోఆడితే. నే నూరికే ఉంటే సరిపోతుందిగాని యేమయ్యా. ఇది వందమందికి అవుతుందే వంట, ఎట్లు తినమంటావయ్యా! నేనేమి కుంభకర్ణున్నా లేక భూతాన్నా? ఇంత దింటానా? ఇన్నిదింటావా? కొంచమైనా బుట్టలో యేమైనా ఉండొద్దూ?"

అర్చ:-తాము సాపడుతారా! ఊరక——

పార్థ:-చూపెట్టినతరువాత పంచుకొని నాగుళ్ళోనే అమ్ముకుందామనా? ఎంత గుండెదీసిన వారయ్యా? దేవుని కనిపెట్టి——కాదు కుంభంవేసి, దేవునిముందే అమ్ముకుంటారా సిగ్గైన లేకుండా? (పటపట పండ్లు కొరుకుతూ) దేవుడేమైన చేస్తాడని భయముంటే తిండిలేక మాడేవాళ్ల కింతైనా వేయకుండా ప్రతిదినం నాపైన పేరుపెట్టి అన్నం, వంటలన్ని అమ్ముకుంటారా?

అర్చ:-స్వామీ శాంతించండి. అది ఆచారం ఇకమీదట-

పార్థ:-(శాంతంతో) జేస్తారు? నేనేమంటే యేమవుతుంది. నాపేరుతో మీరు బాగా మెక్కుతారు. బొజ్జ పెంచుకుంటారు.

అర్చ:-స్వామీ గంధ తాంబూలాదు లుంచాం. పవ్వళిస్తారా!

పార్థ:-ఏమయ్యా నాకేంజెప్పు నేనే మీరు పెట్టినదెల్లా తినేలాఉంటే, యిచ్చినవన్నీ పుచ్చుకొనేలా వుంటే మీరేమైనా ఇస్తారా?

అర్చ:-అదిమాత్రం బాగా ఆలోచించ వలసిన విషయమే స్వామీ? నాకుమాత్రం సందేహమే!

పార్థ:-మరి యిదంతా నటనేగదూ.

అర్చ:-అవునేమో.

పార్థ:-ఏమో యేమి? మీ కోసరాని కిదంతా చేసుకుంటారు. నాకొక హోటలునుండి టిఫిన్‌కారియరు భోజనం తెస్తే నీకు నాకుగూడ అవుతుందే, ఈ మసి బొంధాలెందును?

అర్చ:-మధ్యాహ్నం: తాము పవ్వళిస్తే——

పార్థ:-అంతకంటే మేము చేసేదేముంది ఈచీకటి కొణాల్లో! అయ్యా ఉడుకేస్తుంది. ఎండకాలంగదా. ఒక యెలక్ట్రిక్ ఫాను వేయించరాదా? ఈ ఉక్కకు ఓర్చుకోలేనే. నేను వారి ఆటా చూడను పాటా వినను-అటువంటి భోగపు స్త్రీలకు ఖర్చుపెట్టేదాల్లో నాల్గింట పాలు ఖర్చుపెడితే యిరవై ఫానులొస్తాయి గదయ్యా?

అర్చ:-చిత్తం: మేముకూడా ఇక్కడుండేటపుడు చాల ఉక్క వేస్తుంది వేయించాలిసిందే.

పార్థ:-అర్చకా, యీ మెళ్ళో హారాలు వల్లెవాట్లూ తీసెయ్యాలి. ఎల్లకాలం యెదరొమ్ములో నా పిల్లాన్ని మోసేదానికే నాకు బరువు. ఇవన్నీ రాత్రింబగళ్లు యెట్లయ్యా మోసేది.

అర్చ:-ప్రపంచాన్ని మోసేవారికి ఇదొక బరువా స్వామీ?

పార్థ:-దానికంటే మీదొంగవేషాలు——.అదెందుకు గాని; నిద్రొస్తుంది. సాయంత్రం రా. ఇంకా దున్నో వున్నాయి. చెప్పడానికి.

అర్చ:-చిత్తం.-

అర్చకుడు:- (మంచంపైన పడుకోబెట్టి గంధాను లేపనజేసి బయటికి వచ్చి,) "దేవుడికి కూడా యీ కాలానికి వచ్చినట్లు నడవాలనే ఉంది. మాముందు ఇట్లావన్నీ చూద్దాము (వెళ్లుతాడు.)

దేవుడు:-(మంచంపై పడుకొని) శాపం చేసుకుంటే యీ కాలాన కాదు. శాంతం వహించి నాస్థితి కొంత రిఫారం చేయించుకోవాలి. అర్చకుని తిన్నగా లొంగదీసుకొని మార్పులు చేయించాలి. అబ్బ! ఏమి ఉక్కబెడుతూంది. (అని మంచంమీద మెదలకుండా పడుకుంటాడు.)